క్లుప్తంగా

ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు



కోనేరుసెంటర్: జిల్లాలోని పోలీసు కుటుంబాలతో పాటు ముస్లిం సోదర, సోదరీ మణులకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు రంజాన్ శుభాకాంక్షలను తెలియజేశారు. పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని అల్లాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగ ముస్లిం కుటుంబాల్లో సుఖసంతోషాలను, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని అల్లాను ప్రార్థిస్తున్నానన్నారు. అలాగే అందరూ ఐకమత్యంతో కులమతాలకతీతంగా సోదరభావంతో మెలగాలని కాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

కోనేరుసెంటర్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి ఓ ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటనపై ఆదివారం రాత్రి చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బందరు మండలం మేకవానిపాలెం పంచాయతీ హమాలీ కాలనీకి చెందిన కట్టా నాగమల్లేశ్వరరావు(54) ట్రాక్టర్ నడుపుతుంటాడు. శనివారం మధ్యాహ్నం కాలనీ నుంచి జెడ్పీ సెంటర్ వైపు వెళ్తుండగా ఒక్కసారి తూలు రావటంతో ట్రాక్టర్ చిలకలపూడి సెంటర్‌లోని డివైడర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో నాగమల్లేశ్వరరావు ట్రాక్టర్‌పై నుంచి జారి పడిపోయాడు. తలకు బలమైన గాయం కావటంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన వైద్య సిబ్బంది తలకు గాయం కావటంతో కుట్లు వేసి పంపించారు. అర్ధరాత్రి మరలా ఇబ్బంది కావటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. విజయవాడ ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు వివరాలు నమోదు చేసుకునేందుకు విజయవాడ వెళ్లినట్లు చిలకలపూడి పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణానదిలో పున్నమి ఘాట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని భవానీపురం పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఐదున్నర అడుగుల ఎత్తు ఉన్నాడన్నారు. మృతుడి ఒంటిపై నలుపు, ఎరుపు రంగు గళ్ల షర్ట్, తెలుపు రంగుపై బ్లూ కలర్ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. 40వ డివిజన్ 121 సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి నల్లూరి శాంతకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

ఈద్ ముబారక్

- నేడు ఈద్ ఉల్ ఫితర్
- రంజాన్ ప్రార్థనలకు ఈద్గాలు, మసీదు ప్రాంగణాలు సిద్ధం
- భక్తిశ్రద్ధలతో ముగిసిన ఉపవాస దీక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నెల రోజులుగా కఠిన నియమాలతో ఉపవాస దీక్షలను పాటించిన ముస్లింలు సోమవారం పవిత్ర రంజాన్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. సౌదీ అరేబియా దేశాల్లో శనివారం నెలవంక కనిపించడంతో ఆయా ప్రాంతాల్లో ఆదివారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకున్నారు. భారతదేశంలో సోమవారం పండుగను జరుపుకోవాలని ముస్లిం పెద్దలు నిర్ణయించారు. దీంతో అన్ని చోట్లా ఈద్ సందడి నెలకొంది. ముస్లింలు ఆనందోత్సాహాలతో పండుగ ఏర్పాట్లలో మునిగిపోయారు. ముఖ్యంగా ఈ పండుగను పూర్తి స్థాయిలో భక్తిశ్రద్ధలతో చేసుకునేందుకు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేశారు. ఉపవాసాలతో పాటు ఈ నెలంతా పూర్తిగా ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. ముస్లిం పెద్దలు సూచించిన విధంగా మసీదులకు వెళ్లి నమాజులు చేశారు. నెలవంక కనిపించడంతో మసీదుల్లో తరావీ ప్రార్థనలు ముగించారు. ప్రత్యేకంగా విచ్చేసిన గురువుల ఆధ్వర్యంలో సాగిన ఖురాన్ పఠనం పూర్తి చేశారు. ఎదురుచూసిన వరాల వసంతం వచ్చేయడంతో పండుగ నిర్వహణకు సిద్ధమయ్యారు.



విద్యుత్ వెలుగులో అరండల్‌పేటలోని మస్జిద్ ఈ బిలాల్

ప్రత్యేక నమాజ్‌లకు ఏర్పాట్లు

మసీదు కమిటీల ఆధ్వర్యంలో సోమవారం పండుగ ప్రత్యేక ప్రార్థనల నిర్వహణ కోసం తగిన ఏర్పాట్లు చేశారు. మసీదుల వద్ద కంటే ఈద్గాలలో ప్రార్థనలు నిర్వహించేందుకే ఎక్కువ మంది భక్తులు రానున్నారు. విజయవాడలో ప్రధానంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, పాతబస్తీలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, చిట్టినగర్ ఈద్గాతో పాటుగా అన్ని మసీదుల్లోనూ పండుగ ప్రార్థనలు నిర్వహిస్తారు. దీనికోసం నగర పాలక సంస్థ ఆయా మైదానాలు, ఈద్గాల్లో రంజాన్ ప్రార్థనల కోసం ఏర్పాటు చేసింది.

ఉదయం 7 నుంచి ప్రార్థనలు

అన్ని మసీదులు, ఈద్గాలలో ఆయా నిర్వాహకుల నిర్ణయం ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్నాయి. గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 7 గంటలకు నమాజ్ ప్రారంభం కానుంది. అలాగే ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 8 గంటలకు నమాజ్ ప్రారంభం కానుంది. ఉదయం 11 గంటల వరకూ వివిధ సమయాల్లో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. అదేవిధంగా నమాజ్‌లకు ముందు కొద్దిసేపు ప్రసంగాలు ఉంటాయి. ముస్లింలు వారివారి సమీప ప్రాంగణాల్లో ప్రార్థనలకు హాజరవుతారు.

సమాజ వికాసం.. రంజాన్ పరమార్థం

ఉపవాసం సామాజిక జీవనానికి మూలం. సోదరభావం, సౌభ్రాతృత్వం, దాతృత్వమే పునాదిగా ఉపవాస దీక్ష వెల్లివిరిస్తోంది. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఉపవాసాన్ని పాటిస్తారు. ఎంతటి ఐశ్వర్యవంతుడైనా, కటిక పేదవాడైనా ఉపవాసం వ్రతం ఉండి తీరాల్సిందే. ఈ దీక్షల వలన పేదల ఆకలి బాధను గుర్తిస్తారు. సాటి మానవుని ఆకలి బాధ, కష్టాలు తెలుసుకుని వారిని ఆదుకోవడం, వారి పట్ల దయాగుణాన్ని పెంపొందించుకోవడమే దీక్షల పరమార్థం. దాన, ధర్మాలు చేయటం, ఆర్థిక సహకారం అందించటం తన వంతు బాధ్యతగా భావిస్తారు.

విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న మసీదులు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని అన్ని మసీదు ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. ప్రధానంగా ఆదివారం ఉపవాసాలకు చివరి రోజు కావటంతో ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాతబస్తీ, వించిపేట, చిట్టినగర్, భవానీపురం, అరండల్‌పేట, లబ్బీపేట తదితర ప్రాంతాల్లోని మసీదులన్నీ పండుగ సందర్భంగా ప్రత్యేక అలంకరణలతో కొత్త శోభను సంతరించుకున్నాయి.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



నాగాయలంక: పంచాయతీల పన్నుల వసూళ్లకై ఆదివారం అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ పర్యవేక్షణలో కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు గృహాల వెంట తిరిగి పన్నుల వసూలు చేపట్టారు. ఈ డ్రైవ్ సోమవారం కూడా కొనసాగుతుందని ఈఓపీఆర్డీ చెప్పారు. నాగాయలంక, గణపేశ్వరం, పర్రచివరలో స్పెషల్ డ్రైవ్ జరిపారు. గ్రామ కార్యదర్శులు జరుగు పవన్‌కుమార్, పి.మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో (క్లాప్ మిత్రలు) కలసి ఈఓపీఆర్డీ కలపటపు అప్పల నరసమ్మ, గ్రామ కార్యదర్శి జరుగు పవన్ కుమార్ కాఫీ సేవనం కార్యక్రమం నిర్వహించారు.

వ్యక్తి ఆత్మహత్య

గన్నవరం: అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై గన్నవరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని బూతిమిల్లిపాడు గ్రామానికి చెందిన సవలం మణిబాబు(34) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఇటీవల పచ్చ కామెర్ల వ్యాధి బారినపడ్డారు. ఈ నేపథ్యంలో అనారోగ్య సమస్యలను తాళలేక ఇంటిలో ఫ్యానుకు బెల్టుతో ఉరివేసుకుని ఆత్యహత్య యత్నానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మసీదులకు రంజాన్ శోభ





విద్యుత్ దీపాల వెలుగుల్లో పినగూడూరులంక మసీదు : పటాన్‌పేట మసీదుకు విద్యుత్ దీపాలంకరణ

గూడూరు: మండల పరిధిలోని మసీదులు రంజాన్ శోభను సంతరించుకున్నాయి. గూడూరు జామియా మసీదు, చిన్నమసీదుతో పాటుగా పటాన్‌పేట మసీదుకు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. మల్లవోలు, పోలవరం, తరకటూరు, ఆకులమన్నాడు, పినగూడూరులంక గ్రామాల్లో మసీదులు విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆకట్టుకుంటున్నాయి. సౌదీ అరేబియాలో ఆదివారం పండుగ జరుపుకున్నారు. సోమవారం మన దేశంలో నెలవంక కనిపించడం లాంఛనమే కావడంతో రంజాన్ పర్వదినం జరుపుకోవడానికి ముస్లింలు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా మసీదుల్లో నిర్వహిస్తున్న తరావీహ్ నమాజులు ముగించారు. ఉపవాస దీక్షలు కూడా విరమించారు. సోమవారం ఈద్ గాహ్‌లలో, మసీదుల్లో ఈద్ ఉల్ ఫిత్ర్ నమాజులు ఆచరించడానికి ఆయా మసీదులు, ఈద్‌గాహ్ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ఉదయం 9 గంటలకు గూడూరు ఈద్ గాహ్‌లో ఈద్ నమాజులు ఆచరించనున్నట్లు జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ రహీం తెలిపారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో గూడూరు జామియా మసీదు

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): కదులుతున్న రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాంబే కాలనీ రైల్వే ట్రాక్ పక్కన మగ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడికి 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఒంటిపై వంకాయ రంగు హాఫ్ హ్యాండ్ షర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకీకి విజయవాడ జీఆర్పీ పోలీస్ స్టేషన్ లేదా 94406 27544 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఫుట్‌బోర్డుపై ప్రయాణంతో యువకుడి మృతి

ఉంగుటూరు: బస్సులో ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్న వ్యక్తి జారిపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అవుటపల్లి గ్రామానికి చెందిన అవుటపల్లి ఏసుబాబు(29) రెండు రోజుల క్రితం బస్సు ఎక్కి విజయవాడ వెళ్తున్నాడు. పెద్ద అవుటపల్లి సెంటర్‌లో సర్వీస్ రోడ్డు నుంచి హైవే పైకి బస్సు మలుపు తిరుగుతుంది. అదే సమయంలో ఫుట్‌బోర్డుపై నిల్చున్న ఏసుబాబు ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్న ఏసుబాబు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో ఏఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అవివాహితుడు, దివ్యాంగుడు. గన్నవరం బస్‌స్టాండ్ వద్ద ఆటోలకు సర్వీసింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నాడు.

కార్తికేయ పుణ్యక్షేత్రంలో ఉగాది వేడుకలు

మోపిదేవి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఆలయ ప్రాంగణంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు నేతృత్వంలో ఉదయం ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఆలయ వేద పండితులు ఘనాపాటి నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిపారు. ఉగాది సందర్భంగా దేవస్థానం ఆచార మర్యాదలో భాగంగా శ్రీకాకుళం దేవస్థానం ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం భాస్కరాచార్యులు, పంచాంగ కర్త నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్యశర్మలను దేవస్థానం తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్, సాయిసుప్రియ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని విశేష పూజలు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివారి లడ్డు ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. ఆలయ అధికారులు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మోపిదేవి స్వామివారి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

చలివేంద్రం ప్రారంభం..

వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం తరపున చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఉదయం దేవస్థానం ఎదుట నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు, యాత్రికులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు.

తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో జోరుగా కోడిపందేలు

కోనేరుసెంటర్: బందరు మండలం కోన గ్రామంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వం అన్ని చోట్ల కవులు, వేద పండితుల సమక్షంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తే ఈ గ్రామంలో తెలుగు తమ్ముళ్లు మాత్రం కాయ్ రాజా కాయ్ అంటూ కోడిపందేలకు తెరలేపారు. పందేల విషయంలో తేడా వచ్చినప్పుడల్లా తమదైన శైలిలో ఒకరిపై ఒకరు బూతు పదాలు విసురుకుంటూ వివాదాలకు సైతం దిగారు. గ్రామంలోని శివారు ప్రాంతంలోని గంగానమ్మ గుడికి సమీపంలో వందలాది మంది జూదరులు ఒక చోటుకు చేరి పదుల సంఖ్యలో కోడి పందేలు నిర్వహించి పండుగను జరుపుకున్నారు. ఆదివారం ఉదయం మొదలైన కోడిపందేలు మధ్యాహ్నం వరకు ఏకధాటిగా కొనసాగినా పోలీసులు పట్టించుకున్నా పాపాన పోలేదు. దీంతో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. పక్క గ్రామాల్లోని జూదరులకు ఫోన్‌లు చేసి మరీ పిలిపించి కోడిపందేలు నిర్వహించారు. పోలీసులకు భయపడే వాళ్లతో మీరేం భయపడాల్సిన అవసరం లేదు రండీ పోలీసులు మన బాబాయిలే వచ్చేయండీ అంటూ ధైర్యం ఇచ్చి మరీ పందేలకు పిలిచారు. పందెంకోళ్లకు కత్తులు కట్టి పందెం బరిలో రక్తం ఏరులై పారించారు. కాకి మాది నెమిలి మాది డేగ మాది అంటూ రూ.లక్షల్లో పందేలు కడుతూ పందెం కూతలు పెట్టారు. ఇక్కడ జరిగిన కోడిపందేలకు కోన గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న మరో గ్రామాలకు చెందిన జూదరులు కోళ్లు పట్టుకుని రావటంతో ఆదివారం కోన గ్రామంలో జరిగిన కోడిపందేలు సంక్రాంతి బరిని తలపించాయి. తెలుగు తమ్ముళ్లు బరితెగించి పెద్ద ఎత్తున కోడిపందేలు నిర్వహించినా పోలీసులు పట్టించుకోకపోవటం సర్వత్రా విమర్శలకు దారి తీసింది.



కోన గ్రామంలో కోడిపందేలకు తరలివచ్చిన జూదరులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి



జి.కొండూరు: బైక్‌పై మేనత్త ఇంటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండల పరిధి పొన్నవరం గ్రామానికి చెందిన షోడగిరి రాజేష్(24) అదే గ్రామానికి చెందిన షోడగిరి అనిల్‌తో కలిసి బైక్‌పై వెల్లటూరులోని మేనత్త ఇంటికి శనివారం ఉదయం బయలుదేరాడు. వెల్లటూరు శివాలయం మలుపు వద్దకు రాగానే గేదెలు ఆకస్మాత్తుగా రోడ్డు మీదకు రావడంతో బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న ప్రహరీ వైపు పడ్డారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రాజేష్ తలకు తీవ్రమైన గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెనుక కూర్చున్న అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేష్ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

చల్లపల్లి: ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన క్రైస్తవ మత భోదకుడు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్రంగా దర్యాప్తు చేసి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ దైవసేవకుల ఆధ్వర్యంలో చల్లపల్లి ప్రధాన సెంటర్లో కొవ్వొత్తులు చేతపట్టి నిరసన కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. తొలుత చల్లపల్లి- మచిలీపట్నం ప్రధాన రహదారిపై ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సెంటర్లో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాలది హత్యా..? లేక ప్రమాదమా అనేది పూర్తిస్థాయి దర్యాప్తు చేసి నిజాలు తేల్చాలని కోరారు. ముమ్మందు క్రైస్తవులపై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. శాంతియుత మార్గంలోనే న్యాయం కోసం పోరాడతామని ప్రసంగించారు. ర్యాలీలో దైవసేవకులు ఎం.మరియకుమార్, సి.సాల్మన్‌రాజు, పి.సత్యమూర్తి, పి.దేవదానం, జి.ఏసురాజు, రిటైర్డ్ డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు, పి.ఏసుదాసు, డేవిడ్ గోల్కొండ, ఇమ్మానుయేలు, ఇతర మండలాల సేవకులు పాల్గొన్నారు.





పెడనలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు, విశ్వాసకులు : చల్లపల్లిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దైవసేవకులు

ఘంటసాలలో పాస్టర్ల సంతాపం

ఘంటసాల: ఇటీవల అనుమాన స్పందంగా మృతి చెందిన దైవ ప్రభోదకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల సంతాప సభ మండల పాస్టర్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక గిల్గాలు బేతేలు చర్చిలో నిర్వహించారు. పలువురు దైవజనులు ప్రవీణ్ పగడాల క్రైస్తవ్యానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం, అధికారులు నిజాలు నిగ్గుతేల్చి దోషులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పాస్టర్ల ఆధ్వర్యంలో జరిగే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని పాస్టర్లు పిలుపునిచ్చారు. ఘంటసాల మండల పాస్టర్లు పాల్గొన్నారు.

న్యాయ విచారణ చేపట్టాలి

పెడన: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ చేపట్టి న్యాయం చేయాలని పలువురు క్రైస్తవ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పెడన వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి బస్టాండు సెంటరు వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. తొలుత మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభలో పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిని యాక్సిడెంట్‌గా చిత్రీకరిస్తున్నారని, దీనిపై నిజనిర్ధారణ కమిటీతో న్యాయ విచారణ చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ మరణాన్ని కొందరు రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అన్నదమ్ములుగా నడుచుకుంటున్న మన దేశంలో కొందరు కావాలని కుట్రలు చేస్తూ ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ సంఘ నాయకులు, పాస్టర్లు డానియేల్, కిరణ్‌పాల్, శామ్యూల్, సాల్మన్‌రాజు, క్రీస్తు విశ్వాసకులు, దైవజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పెడన సీఐ.కే నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గూడూరు, పెడన ఎస్ఐలు సత్యనారాయణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



ఘంటసాల చర్చిలో సంతాపం తెలుపుతున్న పాస్టర్లు

ఘంటసాల: పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆకస్మిక మరణం బాధాకరమని పలువురు పేర్కొన్నారు. ఘంటసాల పెద్దగూడెం బాప్టిస్టు చర్చి వద్ద కొడాలి శామ్యూల్ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. ఎండీవీ ప్రసాద్, పాస్టర్ సునీల్, సంఘస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం



పెడన: పట్టణంలోని వీరభద్రపురంలో వేంచేసి ఉన్న శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కర్ణభక్త కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామి వారి ఊరేగింపు, అనంతరం కల్యాణాన్ని వాసా రమేష్, దుర్గ దంపతులచే పండితులు నిర్వహింపజేశారని సంఘ అధ్యక్షుడు వాసా సాంబశివరావు తెలిపారు. భక్తులకు పానకం, పప్పు పంచిపెట్టడం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. శ్యామలరావు, దొడ్డిపట్ల నాగేశ్వరరావు, తమ్మ భీమయ్య, వాస గంగాధరరావు, వాసా కోట నాగేశ్వరావు, రావురి కోటి వీరభద్రం, సమతం సత్యనారాయణ, బొప్పే కృష్ణమోహన్, సమతం గంగాధరం, కాసా గణపతి పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉగాది పర్వదినంతో పాటు సెలవు దినం కావటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి.

ఉత్సాహంగా ఉగాది పర్వదినం

మచిలీపట్నంటౌన్: విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. మచిలీపట్నంలో ప్రజలు పలు ఆలయాలకు వెళ్లి దేవతా మూర్తులను దర్శించుకుని పూజించారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు పంచాంగ పుస్తకాలను, ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. నగరంలోని 29వ డివిజన్ చింతగుంటపాలెంలోని శ్రీ చౌడేశ్వరి సహిత శ్రీ రామలింగేశ్వర స్వామి నూతన ఆలయంలో జక్కుల తారక బ్రహ్మం, జక్కుల మౌలేంద్రశర్మలు ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. నగరంలోని రాబర్ట్సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పొక్కునూరి మాధవశర్మ పంచాంగ శ్రవణం చేశారు. శ్రీ రంగనాయకస్వామి ఆలయం, గొడుగుపేట, బచ్చుపేటల్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు, భోజ్జిల్లిపేట శ్రీనాగేశ్వరస్వామి ఆలయం, రుస్తుంబాదలోని శ్రీ భద్రాద్రి రామాలయం, గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్ర మండలి ఆడిటోరియంలో పంచాంగకర్తలు పంచాంగ శ్రవణం చేశారు. గొడుగుపేటలోని శంకరమఠంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ పంచాంగ శ్రవణం చేశారు.

గాంధీక్షేత్రంలో ఉగాది వేడుకలు

అవనిగడ్డ: స్థానిక గాంధీక్షేత్రంలో ఆదివారం ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడకల్లో వేదపండితుడు, ఘనాపాటి నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. భావదేవరపల్లిలోని అన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలో దివిసీమ సీనియర్ జర్నలిస్ట్ సింహాద్రి కృష్ణప్రసాద్, ఆధ్యాత్మిక వేత్తలైన సమరసత సేవ ఫౌండేషన్ దివి సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ బచ్చు సీతా రామాంజనేయులు, కన్వీనర్ శిర్విశెట్టి సుబ్బారావులకు ఉగాది పురస్కారాలు అందించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతుల చేతుల మీదుగా పురస్కారాలు అందించి సన్మానించారు. అవనిగడ్డకు చెందిన ఆకెళ్ళ దేవనాథన్ శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. ఆలయ అర్చకుడు భరత్‌కుమార్ శర్మ ఆలయంలో శ్రీగణపతి, శ్రీఅన్నపూర్ణదేవి, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి విశేష పూజ జరిపారు. భక్తులకు నూతన పంచాంగాలు బహూకరించారు. నాగాయలంకలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో లంక వెంకట చలపతిరావు పంచాంగ శ్రవణం చేశారు. అర్చకుడు డీవీకే సత్యప్రసాద్ శిష్టాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరి ఆలయం, ప్రసన్న గణపతి దేవస్థానంలో ఉగాది ప్రత్యేక పూజకు భక్తులు అధికసంఖ్యలో సందర్శించారు.

మోపిదేవి: ఉగాది పండుగను ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సాహంగా జరుపుకున్నారు. మోపిదేవి ఆశ్రమ పాఠశాల వసతి గృహ విద్యార్థులు ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి నూతన దుస్తులు ధరించి, ఉగాది పచ్చడికి అవసరమైన మామిడికాయ, వేపపువ్వు, అరటిపండు, కొబ్బరికాయ, చింతపండు, జీలకర్ర, బెల్లం, తదితర వస్తువులను సేకరించి షడ్రుచులు కలగలిపిన ఉగాది పచ్చడిని తయారుచేసి ఇష్ట దేవుళ్లకు నైవేద్యం పెట్టారు. అనంతరం నూతన పంచాంగాన్ని చదివి వినిపించారు.

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా తెలుగు సంవత్సరాదిని జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు ఆలయాలను సందర్శించి దైవ దర్శనం చేసుకున్నారు. కృత్తివెన్ను శివాలయం, పలు ఆలయాలలో వేదపండింతులు పంచాంగ శ్రవణాన్ని భక్తులకు వినిపించారు. ఈ పండుగలో సంప్రదాయమైన ఉగాది పచ్చడి రుచిని ప్రజలు ఆస్వాదించారు. అందరూ నూతన వస్త్రాలు ధరించి సందడిగా గడిపారు.

కోడూరు: మండలంలో ఉగాది సందర్భంగా వేకువజామునే తమ ఇష్టదైవానికి పూజలు చేసి, షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఉగాది వేడుకలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు పంచాంగ శ్రవణం చేయగా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ పర్యవేక్షించారు. ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో 11 అడుగుల మూలమూర్తికి ప్రత్యేక అలంకారం చేశారు. హంసలదీవి వేణుగోపాలుడి ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద ఉగాది పచ్చడిని ఆస్వాదించి సమీప ఆలయాల్లోని స్వామివార్లను దర్శించుకున్నారు.

ఘంటసాల: స్థానిక భద్రావతి సమేత భావనారుషి దేవాలయం, వద్లమూడి, బండి వారి కోదండ రామాలయంలో ఉగాది పండుగ సందర్భంగా పిసుపాటి నరసింహారావు ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో పంచాంగ శ్రవణం చేసిన పిసుపాటిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం తీర్థప్రసాదాలు, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అందె జగదీష్, వి.దుర్గారావు, లక్ష్మి, వి.సుధాకర్, జి.సత్యనారాయణ, కె.శ్రీకాంత్, అర్చకులు గౌతమ్, బండి పరాత్పరరావు, వద్లమూడి బుజ్జి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: ఉగాది పండుగ సందర్భంగా స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయంలో పంచాగ శ్రవణం ఆదివారం నిర్వహించారు. వేదపండితులు ముక్తేవి సత్యనారాయణాచార్యులు పంచాగం, గ్రహరాసులు, నక్షత్రాలు, ఆదాయ వ్యయాలు తదితర అంశాలపై వివరించారు. పలువురికి గ్రహరాశుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కమిటీ సభ్యులు పంచాగ కర్త సత్యనారాయణాచార్యులును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కృత్తివెన్నులో పంచాంగ శ్రవణంలో ఈవో, భక్తులు



ఘంటసాలలో నరసింహారావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



బంటుమిల్లిలో మాట్లాడుతున్న బీ అశోక్

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి పాఠశాల ఆవరణలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం నిర్వహించారు. ప్రాంత సహ కళాశాలల విద్యార్థి ప్రముఖ్ బత్తల అశోక్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. తొలుత ముఖ్యఅతిథి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ ఆర్ఎస్ఎస్ హైందవ సంఘటన కార్యక్రమాలు చేస్తున్న కృషిని వివరించారు. స్వయం సేవకులు చేసిన పలు రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మచిలీపట్నం రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ



మోపిదేవిలో ఉగాది పచ్చడి సిద్ధం చేస్తున్న విద్యార్థులు

ఉగాది పురస్కారాల ప్రదానం





సీఎం చంద్రబాబు నుంచి హంస పురస్కారాన్ని అందుకుంటున్న సింహాద్రి వాణి, శ్రీనివాసరావు

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామానికి చెందిన కేంద్ర సాహిత్య అకాడమీ సెక్రటరీ డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు కళారత్న (హంస) అవార్డును సీఎం చంద్రబాబు నాయుడు నుంచి అందుకున్నారు. అమరావతిలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల్లో భాగంగా డాక్టర్ శ్రీనివాసరావుకు నగదు, హంస విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక పెదప్రోలు గ్రామస్తులు, ఆయన అభిమానులు, సాహిత్య ప్రియులు అభినందనలు తెలిపారు.

అవనిగడ్డ: మండల పరిధిలోని బందలాయిచెరువుకు చెందిన కవయిత్రి సింహాద్రి వాణి సీఎం చంద్రబాబు నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా వాణి పురస్కారాన్ని అందుకున్నారు. పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం 'గంగాభవానీ' అమ్మవారు

- అమ్మవారి 50వ ప్రధాన జాతర ప్రారంభం
- ఇంటింటా చిన్నఅమ్మవారికి ప్రత్యేక పూజలు
- నేడు అమ్మవారి ప్రధాన గుడిసంబరం
- 3న ఆలయ ప్రాంగణంలో మహాచండీయాగం



విద్యుత్ దీపకాంతులతో గంగాభవానీ అమ్మవారి ఆలయం

కోడూరు: భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు దంపతులు తొలిపూజలు చేసి జాతరకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. కోడూరు, ఐబీపేట, యర్రారెడ్డివారిపాలెం, కృష్ణాపురం, నాయుడుపేట గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి, పశుసంపదను కాపాడాలంటూ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. ఆలయంలో పోతురాజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చిన్నఅమ్మవారి గ్రామోత్సవం ప్రస్తుతం వీవర్స్‌కాలనీ, నరసింహపురం గ్రామాల్లో కొనసాగుతోంది. ప్రతి ఇంటి వద్ద అమ్మవారికి నీటిని వారబోసి మహిళలు భక్తిభావం చాటుతున్నారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఐదు శతాబ్దాల చరిత్ర..

కోడూరులోని వంతెన సెంటర్ సమీపంలో సుమారు ఐదు శతాబ్దాల కితం గంగాభవానీ అమ్మవారు వెలిశారు. దీంతో గ్రామస్తులు అమ్మవారికి చిన్న మందిరాన్ని నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. కాలక్రమంలో గంగాభవానీ అమ్మవారి మండల ప్రజల ఇలవేల్పుగా మారింది. దీంతో అమ్మవారి దర్శనానికి భక్తుల తాకిడి పెరగడంతో ఆలయాన్ని నిర్మించారు. అయితే ఆలయ అభివద్ధి మాత్రం అంతగా జరగలేదు. 50 ఏళ్ల క్రితం కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించేందుకు వచ్చిన ఏవీఎస్ రెడ్డి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చారు. ఏవీఎస్ రెడ్డి గ్రామస్తులతో మమేకమై ఆలయానికి అన్ని హంగులను సమకూర్చి జాతరోత్సవాలకు శ్రీకారం చుట్టారు. జాతరోత్సావాల ప్రారంభం రోజున అమ్మవారిని తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి తొలిపూజలు చేయాలని అప్పట్లో తీర్మానించారు. ఎస్ఐ ఏవీఎస్ రెడ్డి చేసిన తీర్మానానికి గ్రామస్తులు కూడా అంగీకరించడంతో అప్పటి నుంచి నేటి వరకు అమ్మవారికి కోడూరు పోలీస్‌స్టేషన్ ఆఫీసర్‌గా ఉండే అధికారి తొలిపూజలు చేయడం అనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది మార్చి 27న అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువ కుమార్, ఎస్ఐ చాణిక్యలు కుటుంబ సభ్యులు, సిబ్బందితో కలిసి ఈ తొలిపూజలను నిర్వహించారు.



తొలిరోజు ప్రత్యేక అలంకారం గంగాభవానీ అమ్మవారు

నేడు ప్రధాన గుడిజాతర..

గంగాభవానీ అమ్మవారి ప్రధాన గుడిజాతరను సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. 50వ జాతర కావడంతో నూతన రంగులతో పాటు ఆలయ ప్రాంగణమంతా పూష్పాలతో తీర్చిదిద్దారు. ప్రధాన రహదారి నుంచి విద్యుత్ దీపకాంతులను ఏర్పాటు చేశారు. అమ్మవారి భారీ చిత్రపటంతో పాటు వివిధ దేవతామూర్తుల చిత్రపటాలను కూడా ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు, టెంట్లను ఏర్పాటు చేశారు. భక్తులతో ఆలయం కిటకిటలాడుతోంది.

మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు..

ఈ ఏడాది అమ్మవారి 50వ జాతర నేపథ్యంలో జాతర అనంతరం మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త యుగంధరరావు చెప్పారు. 1న పంబలవారి రుదిరపూజ (శాంతిపూజ), 2న ఉదయం గ్రామ ఆడపడుచులు, మహిళలచే పాల పొంగళ్లు, సాయంత్రం మహాచండీయాగానికి సంకల్పం, దీక్షధారణ, అఖండస్థాపన, మండపారాధన కార్యక్రమాలు ఉంటాయి. 3న మహాచండీయాగం, మహాపూర్ణాహుతి అనంతరం 25 వేల మందికి మహా అన్నసమారాధన ఉంటుదని చెప్పారు.



ఆకట్టుకున్న అమ్మవారి విద్యుత్ చిత్రపటం